క్లుప్తంగా

10న పూర్వ విద్యార్థుల సమావేశం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 10వ తేదీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో వజ్రోత్సవాలు నిర్వహించాలన్న లక్ష్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి కళాశాలలో చదివిన విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి కె. శివరాంను 8639887801 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. సమావేశానికి నేరుగా హాజరు కాలేని వారు గూగుల్‌మీట్ ద్వారా వర్చువల్‌గా హాజరుకావచ్చని కోరారు.

8న ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యాసాగర్ ఆర్థరైటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదిన మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌మార్గ్‌లోని తమ ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి మహిళలకు ఉచిత ఓపీ, ఎక్స్‌రే పరీక్షలు, ఎముకలు, కీళ్ల సంరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. శిబిరానికి వచ్చేవారు 73370 08322 నెంబరులో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జరగబోవు ఎన్నికలలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని రాష్ట్రీయ ముస్లిం ముక్తి మోర్చా జాతీయ నాయకులు సయ్యద్ మక్బూద్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని అజ్మత్ ఫంక్షన్ హాల్లో ఆప్ కి ఆవాజ్ ఆధ్వర్యంలో ఈవీఎం, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ముస్లింల పాత్ర అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ఈవీఎం విధానం ప్రధాన పాత్ర పోషిస్తోందని.. అయితే ప్రభుత్వాలు కోరుకున్న విధంగానే ఫలితాలు వస్తున్నాయని ఆరోపించారు. ఈ విధానం రద్దు చేసి బ్యాలెట్ విధానం అమలులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష ప్రజా సంఘాల నాయకులు రవిశంకర్‌రెడ్డి, మహ్మద్ ఆలీఖాన్, మగ్బూల్ బాష తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు



లెమన్ అండ్ స్పూన్ పోటీలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలలో భాగంగా ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్ పర్సన్ మేరి విజయకుమారి, జనరల్ సెక్రటరీ విజయ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. తీవ్ర పని ఒత్తిడి మధ్య ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారికి ఇలాంటి ఆటల పోటీలు ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం మహిళలకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం కోశాధికారి కమల, ఇతర ఉద్యోగినిలు పాల్గొన్నారు.

జలవనరులను పొదుపుగా వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కేంద్రీయ భూగర్భ జలబోర్డు రీజినల్ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి

వైవీయూ : జలం జీవనాధారమని, అలాంటి జలవనరులను పొదుపుగా వినియోగించుకోవాలని కేంద్రీయ భూగర్భ జలబోర్డు రీజినల్ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జలస్థర రేఖాచిత్రాలు, నిర్వహణ, ప్రణాళిక అన్న అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ప్రాధాన్యతను అందరూ గుర్తించడంతో పాటు వాటి వినియోగాన్ని సక్రమంగా చేపట్టేలా అవగాహన పెంపొందించాలన్నారు. నీటి అధిక వినియోగం వలన కలిగే నష్టాలను వివరించారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భ జలాల మానిటరింగ్ విధానాలను, రీ జనరేట్ చేసే విధానాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, శాస్త్రవేత్తలు మధుసూదన్, ఈడీ ఓబులేసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

– శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

కడప కల్చరల్ : మహాశివరాత్రి శివ భక్తులకు ఎంతో ప్రియమైనది. ఈ సందర్భంగా భక్తులు శివాలయానికి వెళ్లి మహా దేవుడిని దర్శించుకుని పూజలు చేస్తే ఎక్కువ పుణ్యం లభిస్తుందని భావిస్తారు. శుక్రవారం శివరాత్రి పర్వదినం. ఈ నేపథ్యంలో కడప నగరంలో అత్యంత పురాతనమైన శివాలయాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన వాటి వివరాలిలా ఉన్నాయి.

శ్రీ సోమేశ్వరాలయం (దేవుని కడప శివాలయం)

దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం కడప నగరంలో అత్యంత పురాతనమైన ఆలయంగా వెలుగొందుతోంది. సమీపంలోని శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన సమయంలోనే దీన్ని కూడా నిర్మించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. జిల్లాలోని పురాతన ఆలయాలలో ఒకటిగా భావించే ఈ ఆలయంలోని స్వామిని సోమేశ్వరుడంటారు. అంతరాలయంలో ఉత్తరాన శ్రీ పార్వతీమాత మందిరం ఉంది. ప్రాంగణంలో ఆలయానికి వెనుకవైపు శ్రీ గణపతి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయాలు ఉన్నాయి.

శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయం (గడ్డిబజారు శివాలయం)

స్థానిక గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ దేవి, సోమసుందేశ్వరస్వామి ఆలయం 150 సంవత్సరాలకు పైగా చరిత్ర గలది. శిథిలమైన ఈ ఆలయాన్ని భక్తుడు బాలాజీసింగ్ పునర్నిర్మించడంతో దీన్ని బాలాజీ దేవస్థానంగా కూడా పిలుస్తారు. ఈ ప్రాంగణంలో స్వామి ఆలయం ఎదురుగా శ్రీ హనుమంతుని మందిరం ఉంది. ఆ పక్కనే శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం కూడా ఉండడం విశేషం.

శ్రీ ప్రసన్న విశ్వేశ్వరాలయం (మోచంపేట శివాలయం)

కడప పట్టణం ఏర్పడిన కొద్దిరోజుల్లో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతరాలయంలో ఉత్తరాన శ్రీ అన్నపూర్ణదేవి కొలువై ఉన్నారు. ఆలయం వెనుక శ్రీరాముని కోవెల కూడా ఉంది. ప్రాంగణంలో నవగ్రహాల మండపం ఉంది. బిల్వ, మారెడు, జమ్మి, ఉసిరి చెట్లతోపాటు పవిత్ర పుష్పాల మొక్కలు కూడా ఉన్నాయి. ఆలయాన్ని ఇటీవలే పునరుద్ధరించారు. ఇక్కడి పార్వతిమాత సన్నిధిలో బాలలకు అక్షరాభ్యాసాలు చేయిస్తూ ఉంటారు.

మృత్యుంజయేశ్వరాలయం

కడప నగరం మృత్యుంజయకుంటలోని ఈ ఆలయంలో స్వామికి ఉత్తరాన శ్రీ పార్వతిమాత ఆలయం ఉంది. విశాలమైన ప్రాంగణంలోగల ఈ ఆలయం పర్వదినాల సందర్భంగా భక్తులతో సందడిగా కనిపిస్తుంది. ప్రాంగణంలో దక్షిణాన ఆంజనేయస్వామి ఆలయం, తూర్పున నాగదేవతలు కొలువై ఉన్నారు. పర్వదినాలలో ఎక్కువమంది భక్తులు హాజరయ్యే ఆలయాలలో ఇదొకటి. కార్తీక మాసమంతా ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు.



నబీకోట శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం



మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం

శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం

కడప నగరంలోని నబీకోటలోగల ఈ ఆలయానికి విశేషమైన పేరుంది. ఇక్కడి మల్లికార్జునుడి పక్కనే శ్రీ సర్వమంగళాదేవిమాత కొలువుదీరి ఉన్నారు. ఉత్సవ సమయాల్లో ముఖ్యంగా శివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో ఈ ఆలయంలో స్వర్ణ లింగ దర్శనం ఉంది. అదేరోజున శ్రీశైల శిఖర పాదదర్శనం ఈ ఆలయం ప్రత్యేకతగా చెబుతారు. ఇక్కడి 108 శివలింగాలతో కూడిన శివస్థూపంపై పర్వదినాలలో భక్తులు దీపాలు వెలిగిస్తారు. ఈ ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్నారు. ప్రతి సోమ, శుక్రవారాల్లో సామూహిక కుంకుమార్చన, సుమంగళి పూజలు నిర్వహిస్తారు.

శ్రీ అన్నపూర్ణక్షేత్రం

నగరంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ రామచంద్రయ్య కాలనీలోని శ్రీ అన్నపూర్ణేశ్వరి విశ్వేశ్వరస్వామి ఆలయం నిత్యం భక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. ఇక్కడి స్వామిని భక్తులే స్వయంగా అభిషేకించవచ్చు. ఈ క్షేత్రంలో అమ్మవారితోపాటు ఇతర దేవతా మూర్తుల మందిరాలు కూడా ఉన్నాయి. దాదాపు 800 రకాల ఔషధ మొక్కలు, చెట్లతో ఈ క్షేత్రం ఆహ్లాదానికి మారుపేరుగా ఉంది. ముందే సమాచారం ఇస్తే క్షేత్రాన్ని దర్శించుకునే భక్తులకు నిర్వాహకులు ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తారు.

పొలతలలో ముమ్మర ఏర్పాటు



పొలతల ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శుక్రవారం చండీ హోమం, పూర్ణాహుతి, రథ ప్రతిష్ఠ,కుంకుమార్చన అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. శనివారం ముంగింపు ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి డిపోల నుంచి బస్సు సర్వీస్‌లను కేటాయించారన్నారు. కడప డీఎస్పీ షరీఫ్, సీఐ నాగరాజు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

– జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షక అధికారి ప్రవీణ్‌చంద్

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల విధులకు సంబంధించి చేపట్టే ప్రతి అంశంలోను జాగ్రత్తగా, బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షక అధికారి, కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో.. జిల్లా అదనపు ఎన్నికల అధికారి, డీఆర్వో గంగాధర్ గౌడ్‌తో కలిసి కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్ కడప, ప్రొద్దుటూరు నియోజకవర్గాల ఈఆర్వోలు, సెక్టోరియల్ అధికారులతో ఎన్నికలలో నిర్వహించవలసిన బాధ్యతలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరియల్ ఆఫీసర్ల బాధ్యత చాలా ముఖ్యమైనదన్నారు. సెక్టోరియల్ అధికారుల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రూట్ మ్యాప్‌ను, పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాల్లో ఇంకా ఏమైనా సౌకర్యాలు లేకుంటే వాటికి సంబంధించిన పనులను చేయించాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ నుంచి ఎంఈఓలు నిధులు ఇస్తారని పంచాయతీరాజ్‌శాఖ ద్వారా పనులు పూర్తి చేయాలన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్లు మళ్లీ ఒకసారి వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించి నివేదికను సంబంధిత ఆర్ఓకు పంపించాలన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్ల పరిధిలో ఉన్నటువంటి ఆర్ఓ, ఏఈఆర్ఓలు, తహశీల్దార్ లు, ఎంపీడీఓలు వివిధ రకాల టీమ్స్ లకు సంబంధించిన అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండాలన్నారు. సెక్టోరియల్ అధికారులకు మెజిస్ట్రేట్ పవర్ కలిగి ఉంటుందని తెలిపారు. మీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో గత రెండు సాధారణ ఎన్నికల్లో ఎంసీసీ ఉల్లంఘన కేసులు, ఏమైనా ఇబ్బందులు జరిగివున్నాయా వంటి వాటిని పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఎక్కడైనా గతంలో కన్నా ఇప్పుడు మార్పుంటే వాటి గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు నియోజకవర్గాల సెక్టోరియల్ ఆఫీసుర్లు, ఆర్ఓలు,ఏ ఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షక అధికారి ప్రవీణ్‌చంద్

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ఎర్రబల్లె కొత్తపల్లెలో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

కమలాపురం : రాష్ట్రం, నియోజకవర్గంలో మరింత అభివృద్ధి-సంక్షేమం కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తనయ డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రబల్లె, కొత్తపల్లె, వెంకటాపురం, పొడదుర్తి గ్రామాలలో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఆమె రాకను పురస్కరించుకుని గ్రామాల మహిళలు బాణా సంచా పేల్చుతూ, హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటి తలుపు తట్టి గత ఐదేళ్లలో రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో తన తండ్రి అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. మరింత అభివృద్ధి-సంక్షేమ పథకాల కోసం త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ఆర్‌సీపీని గెలిపించాలని ఆమె కోరారు. గత ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షే మం పూర్తిగా విస్మరించాయన్నారు. ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి-సంక్షేమం స్వాతంత్ర్యం వచ్చి నప్పటి నుంచి ఇప్పటి వరకు జరగలేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి పనులు కళ్లకు కనబడతాయన్నారు. ఇలాంటి పాలన అందించే వైఎ స్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, శ్రీరాం రమణ, రాఘవ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రెడ్డయ్య, ఎన్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, హిదాయత్ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యులు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా కోరారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 38వ డివిజన్ చిలకల బావి, మద్దేఖాన్ మసీదు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ పాదయాత్రలో పేదల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరుస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ జిల్లాను పూర్తిగా విస్మరించారని, నయాపైసా నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత సుమారు రూ.2500కోట్ల అభివృద్ధి పనులు ఒక్క కడప నగరంలోనే జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, దాసరి శివ, రామ్మోహన్‌రెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, పస్తం అంజి, పవర్ అల్తాఫ్, ఎస్. బాదుల్లా, రత్నకుమారి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల సమస్యలను ఎన్నికల ప్రణాళికలో చేర్చాలి

గల్ఫ్‌లో ప్రవాసాంధ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని, తద్వారా వాటి పరిష్కారానికి మార్గం చూపాలని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ కోరారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబులకు వారు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో గల్ఫ్ ప్రవాసాంధ్రుల గురించి ఎటువంటి హామీ ఇవ్వక పోయినా ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్‌టీఎస్)ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం కోసం సంస్థ అధ్యక్షులు మేడపాటి ఎస్. వెంకట్ గారి ఆధ్వర్యంలో పని చేశామన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో విశేష సేవలందించామన్నారు. అలాగే ఉక్రెయిన్ –రష్యా యుద్ధ సమయంలో తెలుగు విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొని రావడంలో, సుడాన్ ప్రభుత్వానికి, ప్రజలకు జరుగుతున్న అంతర్గత సంఘర్షణ లో ఇరుక్కున్న మన తెలుగు వారిని తీసుకుని రావడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కువైట్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు గజ్జల నరసారెడ్డి, కడప ఎన్‌ఆర్‌ఐ గ్రూప్ సభ్యులు షేక్ అన్సర్, బాబు బాయ్, షేక్ గయాజ్, అబ్దుల్ రౌఫ్, షేక్‌అన్వర్, కార్పొరేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

చింతకొమ్మదిన్నె : స్థానిక మూలవంకలోని గంగమ్మ ఆలయానికి వెళ్లే ముఖద్వారాన్ని బుధవారం సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం గంగమ్మ జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, ఆలయ చైర్మన్ పీబీ విశ్వనాథరెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి పోతు సురేష్‌కుమార్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు గజ్జల శ్రీరామ్‌రెడ్డి, ముసల్‌రెడ్డి రాజారెడ్డి, సర్పంచులు వర్దిరెడ్డి సురేంద్రరెడ్డి, సుబ్బరాయుడు, మల్లికార్జున యాదవ్, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

– వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని శిల్పారామంలో శ్రీహరి డిగ్రీ కళాశాల 14వ వార్షికోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల కలిగి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేలా శ్రమించాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుండారెడ్డి , శ్రీహరి విద్యాసంస్థల చైర్మన్ జి. సుబ్బారెడ్డి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సి. విజయభారతి, ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, హరినారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

పెండ్లిమర్రి : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని అనురాధ తెలిపారు. మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ముందుగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పరీక్షలల్లో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించే సంస్కారం పెరగాలి

కడప కల్చరల్ : సమాజంలో మహిళలకు గౌరవం ఇచ్చే సంస్కారం అందరిలో పెరగాల్సి ఉందని జిల్లా మహిళా అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యదర్శి లయన్ కొండూరు జనార్దనరాజు ఆధ్వర్యంలో స్టెప్ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి , ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి, స్టెప్ సీఈవో సి. సాయి గ్రేస్ మాట్లాడుతూ మహిళ ఆర్థిక సామాజిక రంగాల్లో ఎంత ఎత్తుకు ఎదుగుతున్నా పురుషుల్లో వారిపట్ల గౌరవప్రదమైన దృష్టి పెరగాల్సి ఉందన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి వల్లూరు బ్రహ్మయ్య , హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి. ఆరోగ్య, ఉపాధ్యాయురాలు సావిత్రి మాట్లాడారు. అనంతరం లయన్స్ సభ్యులు మహిళా అధికారులను సత్కరించారు.



జిల్లా మహిళా అధికారులను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

నగరంలో చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 2వ డివిజన్ పరిధిలోని ఉక్కాయపల్లె ప్రాంతంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో కాంపాక్టర్ బిన్‌లను ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించాలన్నారు. ప్రతి క్లాప్ వాహనానికి లోడర్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త స్వీకరణ చేయాలన్నారు. అనంతరం ఉక్కాయపల్లె శ్మశాన వాటికను పరిశీలించి భూమి అంతా సర్వే చేసి ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

ప్రతిరోజూ తప్పకుండా ఐదు టన్నుల చెత్తను ప్రాసెస్ చేయాలన్నారు. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో మొక్కలు నాటి, ప్రతిరోజూ నీరు పోసి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ , టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



డ్వామా పీడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది

కడప సిటీ : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పలువురు ఉపాధి సిబ్బంది డ్వామా పీడీ యదుభూషణరెడ్డికి విన్నవించారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. పీఆర్సీ అమలు, వేతనాల పెంపు, వివిధ అలవెన్సులు బేసిక్ పే కలపడం, గ్రాట్యూటీ అమలు తదితర అంశాలపై సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని డ్వామా పీడీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వై.జగదీష్‌రెడ్డి, ఈసీ అన్నానాయక్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ప్రతాప్, ఏపీడీ ఆనంద్, ఏపీఓలు గంగయ్య, వెంకట సుబ్బయ్య, పార్థసారథి, సుధారాణి, డీఆర్‌పీ భానుప్రియ పాల్గొన్నారు.